క్లుప్తంగా

డ్రమ్ సీడర్‌తో వరిసాగు మేలు



వీపనగండ్ల: డ్రమ్‌సీడర్ పద్ధతిన వరి పంటను సాగు చేయడం వల్ల అధిక దిగుబడులను పొందవచ్చని వీపనగండ్ల క్లస్టర్ ఏఈఓ రజిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతుల పంట పొలాలకు వెళ్లి డ్రమ్ సీడర్‌తో వరిని విత్తే విధానాన్ని రైతులకు వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని తెలిపారు.

మట్టి అక్రమం తరలింపు



మదనాపురం: మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం అనుమతులు లేకుండా సొంత ప్లాట్లకు కొందరు మట్టిని అక్రమంగా తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తిర్మాలయపల్లి సమీపంలోని భీమా కాలువ మట్టిని జేసీబీ సహాయంలో తీసి ట్రాక్టర్లతో రైల్వే గేటు సమీపంలో ఉన్న ప్లాట్లకు తరలించారు. ఈ విషయాన్ని గుర్తు తెలియని వ్యక్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బందితో కలిసి మట్టి ట్రాక్టర్లను నిలిపివేశారు. అప్పటికే అధికారులకు తెలియకుండా 15 ట్రాక్టర్ల మట్టిని కొట్టినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. మండలంలో అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నరేందర్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఎవరు ఉల్లంఘించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని దొడగుంటపల్లిలో అయిల్‌పాం సాగుపై వ్యవసాయ అధికారులు శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి కృష్ణయ్య మాట్లాడుతూ రైతులు అయిల్‌పాం సాగు చేస్తే కూలీలు, పెట్టుబడుల ఖర్చులు తగ్గడంతో పాటు అధిక లాభాలు పొందవచ్చని, అన్నిరకాల నేలలో సాగుకు అనుకూలమని తెలిపారు. 12 నుంచి 13 ఆకులున్న మొక్కలను నర్సరీ నుంచి తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీ, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 80 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం అందిస్తామని పేర్కొన్నారు. ఆయిల్‌ఫామ్ చేయదలసిన రైతులు వ్యవసాయ కార్యాలంలోని సంప్రదించాలని కోరారు.

క్యాలెండర్ విడుదల



మదనాపురం: మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం 2023 క్యాలెండర్‌ను శుక్రవారం జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, సర్పంచ్ రాంనారాయణ విడుదల చేశారు. కార్యక్రమంలో వెంకట్‌నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, రాజు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, ప్రసాద్ ఉన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దాం

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): టీపీసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 22న నాగర్‌కర్నూల్ జిల్లా బుద్దారంలో నిర్వహించే దళిత, గిరిజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మండల కేంద్రంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, మైనార్టీ నాయకులు, గిరిజనులు, దళితులు, ప్రజలు పెద్ద ఎత్తున్న తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములుయాదవ్, పటణ అధ్యక్షుడు గోవిందు, ఎంపీటీసీ ఎల్లస్వామి, రైతు కమిటీ అధ్యక్షుడు రాముడు, ఆశన్న, మదిలేటి తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- విద్యుత్, తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు
- సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- ప్రజాప్రతినిధులు అభివృద్ధికి సహకరించాలి
- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



పాన్‌గల్‌లో మార్నింగ్ వాకింగ్ చేస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: వచ్చే వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్, తాగునీటి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరై సభ్యుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు దేశానికే అదర్శంగా నిలుస్తున్నాయన్నారు. విద్యుత్, మిషన్ భగీరథ వంటి సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు ఆయా సమస్యలపై అలసత్వం వహించకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం

వివిధ గ్రామాల్లో సర్పంచ్‌లు ఏర్పాటు చేస్తున్న వీధి దీపాలకు సంబంధించిన బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏఈకి సూచించారు. గ్రామాలకు మంజూరైన ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సర్పంచ్‌లు సహకరించి తీర్మానాలు ఇవ్వాలని కోరారు. సాక్షిలో వచ్చిన 'పీహెచ్‌సీలో నీటి కటకట' అనే అంశంపై సమావేశంలో చర్చ జరిగింది. సమస్యలు దినపత్రికలో వచ్చే వరకు వేచి చూడకుండా.. అధికారులు ఆయా సమస్యలను మండల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పీహెచ్‌సీలో నీటి సమస్య పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హామీ ఇచ్చారు.

మండల కేంద్రాన్ని అభివృద్ధి చేస్తాం

మండల కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఉదయం గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. దీంతో పాటు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్నారు. ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ లైన్లను మార్చేలా చర్యలు తీసుకోవాలని ఏఈకి సూచించారు. మండల కాంప్లెక్స్ భవన నిర్మాణం, వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయ భవన నిర్మాణాలు చేపట్టే స్థలాలను ఆయన పరిశీలించారు. గ్రామంలో తీవ్రంగా ఉన్న కోతుల బెడదను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్‌కు సూచించారు.

పేదింటి ఆడ బిడ్డలకు వరం కల్యాణలక్ష్మి

పేదింటి ఆడ బిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరం లాంటివి అని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 50 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

అన్నారంలో సీసీ కెమెరాలు ప్రారంభం

దాతల సహకారంతో మండలంలోని అన్నారంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు తోడ్పాటునందిండం అభినందనీయమన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, వెంకటయ్యనాయుడు, రాముయాదవ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పీఆర్ ఈఈ మల్లయ్య, తహసీల్దార్ ఏసయ్య, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవుకు ప్రాణదానం



వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో రైతు వెంకటేశ్వర్‌రెడ్డికి చెందిన గోవు ప్రసవ వేదనతో ప్రాణపాయ స్థితిలో ఉండగా శుక్రవారం సంచార పశు వైద్య బృందంతో కలిసి స్థానిక పశు వైద్యులు గోవుకు ఆపరేషన్ నిర్వహించి ప్రాణాలను కాపాడారు. ప్రసవ సమయంలో పసిదూడ కడుపులో చనిపోవడంతో ప్రాణపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న గోవుకు తక్షణం ఆపరేషన్ నిర్వహించాల్సి ఉండగా.. రైతు ఇచ్చిన సమాచారం మేరకు తక్షణమే స్పందించిన పశు వైద్యులు కొల్లాపూర్ పశువైద్య సంచార వాహనానికి సమాచారం అందించారు. దీంతో అవసరమైన పరికరాలను తీసుకొచ్చి కడుపులోనే మృతి చెందిన శిశుదూడను బయటకు తీసి ఆపరేషన్ నిర్వహించి గోవు ప్రాణాలను కాపాడారు. కార్యక్రమంలో పశువైద్యులు శ్యాం, యాదగిరి, సహవైద్యులు సత్యం, వెటర్నరీ అసిస్టెంట్ శివాజీ, సంచార పశువైద్యబృంద సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతుగా తోడ్పాటును అందిస్తున్నానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేందుకు స్టడీ మెటీరియల్‌ను రూపొందించి మండలంలోని పిన్నంచర్ల, జూరాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం అందజేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆరు పేపర్లకు అనుగుణంగా ప్రముఖ విద్యా నిపుణులచే స్టడీ మెటీరియల్‌ను రూపొందించినట్లు తెలిపారు. రూ.20లక్షల వ్యయంతో 3,500 ఇంగ్లిష్ మీడియం, 1,500 తెలుగు మీడియం స్టడీ మెటీరియల్ బుక్కులను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యారంగ సంస్థల్లో విద్యార్థులకు కావల్సిన స్టడీ మెటీరియల్, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో వీజేఆర్ ఫౌండేషన్ ముందుంటుందని, ఇది వరకే ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు లక్ష్మీదేవి, ప్రసాద్, ఉపాధ్యాయులు గ్రామస్తులు ఉన్నారు.

పోడు భూముల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసుకుంటున్న పోడు భూముల సమస్యలను పరిష్కరించి వారికి పట్టాలు ఇవ్వాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యనాయక్ మాట్లాడారు. మండలంలోని మాధరావుపల్లి, శాగాపూర్, దావాజీపల్లి, కిష్టాపూర్, రేమద్దుల గ్రామాల్లో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులు పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వారిలో అర్హులను గుర్తించి పట్టాలు ఇవ్వాలని కోరారు. దీంతో పాటు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకొని ఏళ్ల గడుస్తున్నా రుణాలు మంజూరు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శాంతమ్మ, రంగానాయక్, దేవీసింగ్ పాల్గొన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో చౌడేశ్వరీదేవి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ప్రతి ఏటా మాఘ శుద్ధ పాడ్యమి రోజు ఈ ఉత్సవాలను జరపడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. యాదవల ఇలవేల్పుగా పిలుచుకునే చౌడేశ్వరీ ఉత్సవాలను వేణుగోపాల స్వామి ఊరేగింపుతో ప్రారంభించి నాలుగు రోజుల పాటు కొనసాగుతాయి. ఈ జాతర కోసం స్థానిక సుభాష్ చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా వివిధ రకాల దుకాణాలు వెలుస్తాయి.



చౌడేశ్వరీ అమ్మవారి మూల విగ్రహం

కార్యక్రమాలు ఇలా..

చౌడేశ్వరి జాతర శనివారం జరిగే వేణుగోపాల స్వామి ఊరేగింపుతో ప్రారంభమవుతుంది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు చౌడేశ్వరీ దేవి గంగస్నానం, రాత్రి 11:30 గంటల నుంచి సోమవారం తెల్లవారు జామున వరకు అమ్మవారి పల్లకీ సేవ, జ్యోతుల ఊరేగింపు జరుగుతుంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం రాత్రి 8 గంటల వరకు భక్తుల దర్శనార్థం అమ్మవారిని చిన్న చౌడేశ్వరీ గుడి వద్ద ఉంచుతారు. ఈ ఉత్సవాల సందర్భంగా స్థానిక రైతు సంఘం భవనం వద్ద నాటకాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. దీంతో పాటు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు, చెక్క భజన, బొడ్డెమ్మ తదితర పోటీలను నిర్వహిస్తారు.

డబ్బాల తొలగింపులో ఉద్రిక్తత

అమరచింత: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించే సమయంలో డబ్బాల యజమానులు, మున్సిపల్ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకోంది. అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేసుకున్నారని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా ఆదేశాలతో వాటిని తొలగించే కార్యక్రమానికి మున్సిపల్ సిబ్బంది శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ సిబ్బంది డబ్బాలను తొలగించేందుకు వెళ్లగా డబ్బాల యజమానులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణకు దారితీసింది. అనంతనం డబ్బాల యజమానులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యను పరిష్కరించడంతో పాటు ఉపాధి చూపే వరకు డబ్బాలను తొలగించొద్దని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా మాట్లాడుతూ అక్రమంగా డబ్బాలను వేసుకున్నారని, వాటిని అక్కడి నుంచి తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు.

గిరిజన బంధు ఏమైంది?



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

వనపర్తి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఇచ్చే సబ్సిడీలను ఎత్తివేసి రూ.పదివేల రైతుబంధుతో రైతుల జీవితాలతో బీఆర్ఎస్ చెలగాటమాడుతోందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దళిత గిరిజన సదస్సు నియోజకర్గ ఇన్‌చార్జ్ కృష్ణారెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి చిన్నారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులను దారి మళ్లిస్తూ ఆ నిధులతోనే ఖమ్మంలో బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు. దళిత బంధు పథకమే అమలవుతుందా లేదా అన్నట్లుగా ఉందని, ముఖ్యమంత్రి ప్రకటించిన గిరిజన బంధు పథకం ఎటు పోయిందని నిలదీశారు. బీఆర్ఎస్‌లోనే చేరితేనే పథకాలు వర్తింపజేస్తామనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. గిరిజన బంధు పథకం కార్యచరణకు ఎప్పుడు వస్తుందో తెలియదని, మాయ మాటలతో దళిత, గిరిజనులను కేసీఆర్ ప్రభుత్వం వంచిస్తోందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కృష్ణారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు కమ్మర్ మియా, అనీస్, కదిరె రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అక్షయ్, నరసింహ, ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని దుకాణాదారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కలెక్టర్ యాస్మీన్‌బాషా ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పొగాకు సుఖేశిని, కమిషనర్ వెంకటేశ్వర్లు పలు షాపుల్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగిస్తే వచ్చే అనర్థాలపై దుకణాదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ను వినియోగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ రవీందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుకాణదారుడికి జరిమానా విధిస్తున్న అధికారులు

పార్టీ బలోపేతానికి కృషి : బీజేపీ



కొత్తకోట: భారతీయ జనతా పార్టీ అభివృద్ధిలో కార్యకర్తలు భాగస్వాములు కావాలని బీజేపీ పాలమూరు పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కొత్తకోటలో జరిగిన బీజేపీ బూత్ కమిటీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో పూర్తి సమయం కార్యకర్తలుగా పనిచేయాలని, అలాగే రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యకర్తల అండతోనే పార్టీ బలపడుతుందని తెలిపారు. అనంతరం పాలమూరు పార్లమెంట్ ప్రభారీగా విచ్చేసిన చంద్రశేఖర్‌ను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో కొమ్ము భరత్‌భూషణ్, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మన్నెంయాదవ్, నరెందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కేరళ విధానం అమలు చేయాలి

వనపర్తి క్రైం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు పీరియడ్స్ సమయంలో, మహిళా ఉపాధ్యారాళ్లకు మెటర్నిటీ సెలవులు ఇచ్చేందుకు తాజాగా కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ విధానం రాష్ట్రంలోనూ ప్రవేశపెట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం వనపర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీరియడ్స్ సమయంలో ఇబ్బందుల దృష్టితో కేరళ రాష్ట్రం సెలవును అమలులోకి తెచ్చిందన్నారు. సమావేశంలో సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు జయ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్‌గౌడ్

ఖిల్లాఘనపురం: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని రోడ్డుమీదితండాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్లు వాడకం తప్పని సరి అయిందని, ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. తెలియని వ్యక్తులకు ఖాతా నెంబర్, ఓటీపీ, ఏటీఎం పిన్ చెప్పరాదన్నారు. అలాగే ప్రతి గ్రామంలో సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవడం వలన దొంగతనాలను అరికట్టవచ్చన్నారు. ఎవరైనా మోసానికి పాల్పడుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే 1930 లేదా 100 నెంబర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాలన్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డికి సన్మానం



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పాన్‌గల్: మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి టీఎల్ఎం మేళాకు ఆర్థిక తోడ్పాటు నందించిన దాత, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మండల స్థాయి టీఎల్ఎం మేళా, క్విజ్ పోటీలు, భోజనానికి దాత రూ. 80 వేలు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో కృతజ్ఞతగా ఈ సన్మానం చేసినట్లు వారు పేర్కొన్నారు. రేమద్దుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఈశ్వరయ్య తన చేతులతో వేసిన దాత చిత్రపటాన్ని అందజేశారు. విద్య అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటునందించిన దాతను ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ హైమావతి, తహసీల్దార్ ఏసయ్య, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వనపర్తి: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ సొంత మండలం శ్రీరంగాపుర్ పరిధిలోని తాటిపాములకు చెందిన యువకులు సుమారు 40 మంది శుక్రవారం గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వారికి గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టుదలకు మారుపేరుగా దేశ రాజకీయాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న కేసీఆర్ తెగువకు ఆకర్శితులై.. యువకులు బీఆర్ఎస్ వైపు వస్తున్నారని మంత్రి వెల్లడించారు. బీజేపీ ఎన్ని జిమ్మికులు చేసినా.. తెలంగాణలో ఆ పార్టీకి ఆదరణ లేదని ఎద్దేవా చేశారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు రమేష్, బండారు వెంకటయ్య, సురేష్, రాముడులతో పాటు మరికొందరు ఉన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పీర్లగుట్ట ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ప్రమాదవశాత్తు ఇటీవల మరణించగా.. బాధిత కుటుంబానికి మంత్రి రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు.

అంధత్వ నివారణకు చర్యలు

అమరచింత: కంటి వెలుగు కార్యక్రమంలో 18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు, కంటి ఆపరేషన్లు చేస్తున్నామని డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగంపేటలో రెండో రోజు కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన సంధర్శించారు. ఈమేరకు వైద్యాధికారి డాక్టర్ దీపికతో కంటి పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. సింగంపేటలో రెండో రోజు 290 మంది కంటి పరీక్షలు నిర్వహించగా.. 47 మందికి కంటి అద్దాలను అందించారు. 8 మందిరి కంటి శస్త్ర చికిత్సల కోసం సిఫార్సు చేశామని డాక్టర్ దీపిక తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు, హెల్త్ సూపర్ వైజర్ సురేందర్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: గోవర్ధనగిరిలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని జిల్లా అదనపు వైద్యాధికారి శ్రీనివాసులు సందర్శించారు. కంటి పరీక్షలకు సంబంధించిన నివేదికలను విధిగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆయన వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, అదనపు వైద్యులు రాజశేఖర్, కరుణ, సర్పంచ్ చంద్రకళ, సురేష్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్, పిన్నంచర్లలో కంటివెలుగు కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమీషనర్ రమేష్, కౌన్సిలర్ చెన్నయ్య, సర్పంచ్ లక్ష్మి పరిశీలించారు. రెండోరోజు 626 మందికి పరీక్షలు నిర్వహించి 49 మందికి కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేయగా.. 107 మందికి అద్దాలు అందించారు. ఇంకా 100 మందికి కంటి అద్దాలు ఇవ్వాల్సి ఉంది. కార్యక్రమంలో వైద్యులు రంజిత్‌రెడ్డి, శివలీల, దీపిక, నిఖిత, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.



గోవర్ధనగిరిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి శ్రీనివాసులు

468 మందికి కంటి పరీక్షలు

పాన్‌గల్: మండలంలోని అన్నారం, మాందాపూర్, మల్లాయిపల్లిలో శుక్రవారం 468 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డా.హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పరీక్షలు నిర్వహించిన వారిలో 64 మందికి అద్దాలు, కంటి ఆపరేషన్ కోసం 46 మందిని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యులు డా.నిహారిక, డా.చంద్రశేఖర్, డా. శ్వేత, అప్తాలమిస్ట్ తాకీర్ తదితరులు పాల్గొన్నారు.



సింగంపేటలో..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని శేరుపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ సునీత, మండల మెడికల్ ఆఫీసర్ రాముడు ప్రారంభించారు. శిబిరంలో 158 పాల్గొనగా వారిలో 29 మందికి అద్దాలు అందించామని, ఇంకా 40 మందికి అద్దాలు ఇవ్వాల్సి ఉందని వారు తెలిపారు. ఆరుగురికి ఆపరేషన్‌కు రిఫర్ చేశామని తెలిపారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంపీఓ రాజు, వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం అనురాధ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని కోతులకుంట తండా, వెనికితండాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ విజయ్‌కుమార్ పరిశీలించారు. ఖిల్లాఘనపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కోతులకుంటతండాలో మొత్తం 206 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో 15 మంది అద్దాలు పంపిణీ చేయగా ఒక్కరికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించామన్నారు. కమాలోద్దీన్‌పూర్ వైద్యాధికారి సౌజన్యలత మాట్లాడుతు వెనికితండాలో 171 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో 39 మందికి కంటి అద్దాలు, ఐదుగురిని ఆపరేషన్ల కోసం సిఫార్సు చేశామని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com